7

సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 21 । డిసెంబర్ । 2023



వాడపల్లి క్షేత్రంలో సిరుల వర్షం

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా రూ.85,16,279 ఆదాయం సమకూరింది.


8లో



సాత్విక్‌కు ఖేల్‌రత్నపై హర్షం

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌కు 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డు వరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

డెల్టాలకు 11 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

సీసీ రోడ్ల నిర్మాణం త్వరలో పూర్తి



బండారులంక - దంగేటివారిపాలెం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: నియోజకవర్గ పరిధిలోని అన్ని సీసీ రోడ్ల నిర్మాణాన్ని సార్వత్రిక ఎన్నికల్లోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బండారులంక - దంగేటివారిపాలెం, పాలగుమ్మి - చప్పిడివారిపాలెం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో బుధవారం సుమారు రూ.2.50 కోట్ల వ్యయం కాగల సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. కొన్ని సీసీ రోడ్ల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయని, వాటిని కూడా సంక్రాంతి లోపు పూర్తి చేయాల్సిందిగా ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఆర్‌అండ్‌బీ డీఈ రాఘవరావు, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణేశ్వరరావు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, ఎఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, సర్పంచులు పెనుమాల సునీత, కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు గుత్తుల జానికిలక్ష్మి, కామశెట్టి కుసుమ, అంకం హిమ భారతి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

అమలాపురం రూరల్: జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ పారదర్శకంగా, దోషరహితంగా నిర్వహించేందుకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో గత వారం కార్యక్రమాలను, ఈవీఎంల వినియోగం, బూత్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలపై వివరించారు. ఒకే ఫొటో ఉన్న ఎంట్రీలను గుర్తించి, రిజిస్టర్ పోస్టులో నోటీసులు అందించి, నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేపడతామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేరుస్తామని చెప్పారు. మరణ ధ్రువపత్రాలు, పంచనామాలు, డిక్లరేషన్ వంటి ప్రక్రియల ద్వారానే ఓట్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ నెట్‌బాల్ పోటీలకు సాయిశ్రీ ఎంపిక



జాతీయ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన సాయిశ్రీ

రావులపాలెం: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు అండర్-16 విభాగంలో ఈతకోట హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీ సాయిశ్రీ ఎంపికైంది. హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి బుధవారం ఈ విషయం తెలిపారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సాయిశ్రీ పాల్గొంటుందని చెప్పారు. సాయిశ్రీకి దారి ఖర్చుల నిమిత్తం గణిత ఉపాధ్యాయుడు బండారు వెంకటేశ్వరరావు రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పీటీలు రామకృష్ణ, పల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో లక్ష్మీ సాయి అమృత ప్రతిభ



కాంస్య పతకం సాధించిన లక్ష్మీసాయి అమృత

రాజోలు: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని కోళ్ల లక్ష్మీ సాయి అమృత ప్రతిభ చూపి, కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం దొంగ జానకిరామయ్య ఆధ్వర్యాన లక్ష్మీసాయి అమృతను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో నంద్యాలలో జరిగిన అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో అమృత ప్రతిభ చూపిందన్నారు. ఆమెను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, వ్యాయామోపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ అభినందించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ప్రజల వద్దకే పరిపాలన లక్ష్యంతో 12 శాఖలతో ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీటిలో మాకు ఉద్యోగావకాశం వచ్చింది. మూడేళ్లకే పర్మినెంట్ చేసి, రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హోదా, అన్ని సౌకర్యాలూ కల్పించారు. సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఎస్.హరిప్రసాద్‌బాబు, గ్రేడ్-5 సెక్రటరీ, గ్రామ సచివాలయం-3, కొత్తపేట

సచివాలయాల సేవలు భేష్



మండల కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండానే పలు సేవలను సచివాలయాల ద్వారా పొందుతున్నాం. నాకు మూడెకరాల పొలం ఉంది. దానికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం, నా భూమి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నాను. మా పిల్లలకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సచివాలయం ద్వారా పొందాం.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక, ముమ్మిడివరం మండలం

జీవితాలు మారాయి



వార్డు సచివాలయాలు వచ్చిన తరువాత నాలాంటి గృహిణులకు ఇల్లు కదలకుండానే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. నాకు జగనన్న చేయూత, పింఛను, మా అబ్బాయికి జగనన్న చేదోడు ద్వారా లబ్ధి వచ్చిందంటే మాకు వార్డు సచివాలయ ఉద్యోగులు, పిలిస్తే పలికేంత దూరంలో వలంటీర్ ఉండటం వల్లే సాధ్యమైంది.

– దువ్వా మంగ, నారాయణపేట, అమలాపురం

సామాన్యుల సేవాలయం

- ఉన్న ఊళ్లోనే ప్రభుత్వ సేవలు
- గ్రామ/వార్డు సచివాలయాలతో సాకారం
- ఈ వ్యవస్థ.. సీఎం జగన్ మానసపుత్రిక
- జిల్లాలో 515 సచివాలయాలు
- ప్రజలకు సేవలందిస్తున్న 4,403 మంది ఉద్యోగులు



అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న కార్యదర్శి

సాక్షి, అమలాపురం: ఒకప్పుడు ప్రభుత్వ పరమైన పనులేవైనా ఉంటే.. ఆయా కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. కులం, ఆదాయం, నివాసం, బర్త్, డెత్ వంటి చిన్నచిన్న సర్టిఫికెట్ల కోసం కూడా ప్రజలు నానా హైరానా పడేవారు. పైగా దూరాన ఉన్న మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. తీరా వెళ్లిన తరువాత అక్కడ సంబంధిత అధికారులు లేకపోతే ఉసూరుమంటూ వెనుతిరగాల్సిన పరిస్థితి. దీంతో వ్యయ ప్రయాసలు తప్పేవి కావు. పైగా, చాలాచోట్ల లంచాల బెడద.. దీంతో ప్రజలు నానా ఇబ్బందులూ పడుతూ నిస్సహాయ స్థితిని ఎదుర్కొనేవారు. ఎంతో కీలకమైన ఈ సమస్యను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్ప పాదయాత్రలో గుర్తించారు. దీని పరిష్కారానికి ఉన్న ఊళ్లోనే ప్రజలకు వివిధ ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అన్నట్టుగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలానికే వైఎస్ జగన్ ఆ మాట నిలబెట్టుకున్నారు. పరిపాలనా రంగంలో సరికొత్త సంచలనానికి తెర తీస్తూ.. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుమారు ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేయడం ద్వారా.. వివిధ ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిట్లోకే తీసుకువచ్చి, వారి కష్టాలకు తెర దించారు. ప్రభుత్వ పథకానికి దరఖాస్తు నుంచి భూమి రిజిస్ట్రేషన్ల వరకూ.. కుల ధ్రువీకరణ పత్రాల నుంచి కొత్త రేషన్ కార్డుల వరకూ.. ఆదాయ ధ్రువీకరణ పత్రాల నుంచి ఆధార్‌లో మార్పుల వరకూ.. విద్యుత్ బిల్లుల చెల్లింపుల నుంచి రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లు పొందేంత వరకూ.. ఇలా సచివాలయ వ్యవస్థ ద్వారా ఏకంగా 515 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనికితోడు వలంటీర్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిట్లోనే అందిస్తున్నారు. పరిపాలనలో సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చిన ఈ పెనుమార్పుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గురువారం సీఎం జగన్ జన్మదినం సందర్భంగా ఆయన మానసపుత్రికలుగా పేరొందిన సచివాలయాలను గొప్పగా గుర్తు చేసుకుంటున్నారు.

ఎన్నో సేవలు

జిల్లాలో 467 గ్రామ, 48 వార్డు సచివాలయాలు కలిపి మొత్తం 515 సచివాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రజలకు 515 సేవలందుతున్నాయి. వీటిలో అత్యధికంగా కుల, ఆదాయ, నివాస, వివాహ ధ్రువీకరణ పత్రాలు, విద్యుత్ బిల్లులు, నీటి తీరువా చెల్లింపు, కుటుంబ సభ్యుల ధ్ర/వీకరణ పత్రాలు, ఆధార్ మార్పులు, చేర్పులు, ఆర్ఓఆర్ 1బీ, కంప్యూటరైజ్డ్ అడంగళ్లు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, మ్యుటేషన్, పెన్షన్ల వంటి సేవలను అన్ని వర్గాల ప్రజలూ సులువుగా పొందుతున్నారు.

4,403 మందికి ఉద్యోగాలు

సచివాలయ వ్యవస్థ ద్వారా జిల్లాలో 4,403 మందికి ఉద్యోగాలు వచ్చాయి. సచివాలయాల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరీకల్చర్ అసిస్టెంట్లుగా 467 మంది ఉద్యోగాలు పొందారు. వీరితో పాటు ఏఎన్ఎంలు, ఎనర్జీ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-6), డిజిటల్ అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లు, ఫిషరీస్/వెటర్నరీ అసిస్టెంట్లు, వీఆర్ఓలు, వెల్ఫేర్/ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా ఒక్కో విభాగంలో జిల్లావ్యాప్తంగా 467 మంది చొప్పున ఉద్యోగాలు పొందారు. వీరితో పాటు వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డ్ ఎమ్మినిటీస్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీలు, వార్డు మహిళా పోలీసు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీల విభాగాల్లో ఒక్కో పోస్టుకు జిల్లాలో 48 చొప్పున నియమితులయ్యారు.

జిల్లాలో ఇప్పటి వరకూ గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా అందించిన సేవలు

కుల ధ్రువీకరణ పత్రాలు	5,82,454
ఆదాయ ధ్రువీకకరణ పత్రాలు	5,60,049
విద్యుత్ బిల్లుల చెల్లింపు	4,15,729
కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు	11,807
ఆధార్ మార్పులు, చేర్పులు	76,700
ఆర్ఓఆర్ 1బీ	1,23,345
కంప్యూటరైజ్డ్ అడంగళ్లు	89,658
రేషన్ కార్డుల మార్పులు, చేర్పులు, ఇతరాలు	47,572
మ్యుటేషన్	33,922
పెన్షన్లు	30,492

(మరిన్ని ప్రజా సమస్యలను కూడా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పరిష్కరించింది.)

2022 జూన్ 1 నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ సచివాలయాల ద్వారా నియోజకవర్గాల వారీగా అందిన దరఖాస్తులు

నియోజకవర్గం	దరఖాస్తులు
పి.గన్నవరం	3,91,501
రాజోలు	3,23,031
కొత్తపేట	3,99,955
మండపేట	4,47,126
రామచంద్రపురం	2,36,182
ముమ్మిడివరం	3,87,074
అమలాపురం	4,31,332
మొత్తం	**21,16,201**

సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా



గతంలో చాలా మంది పింఛన్ కోసం తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లేవారు. రోజుల తరబడి పనులయ్యేవి కావు. నేను మా ఊరి సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్దకే పింఛన్ వస్తోంది.

– కాదులూరి లక్ష్మీ నాగమణి, మలికిపురం

ఆపద వేళ తక్షణ సాయం



నా భర్త ఈ నెల ఎనిమిదో తేదీ అర్ధరాత్రి అనారోగ్యంతో చనిపోయారు. వైఎస్సార్ బీమా ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం వెంటనే రూ.10 వేలు తీసుకువచ్చి అందజేశారు. అందుబాటులోనే సచివాలయం ఉండటంతో వెంటనే సాయం అందింది. ఇందంతా జగన్ పుణ్యమే.

– వాసంశెట్టి లోవకుమారి, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా కమిటీ నియామకం

జిల్లా అధ్యక్షురాలిగా మునికుమారి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మహిళా విభాగం జిల్లా కమిటీని అధిష్టానం నియమించింది. అధ్యక్షురాలిగా కాశి బాల మునికుమారి (ముమ్మిడివరం నియోజకవర్గం) నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా రేవు మల్లేశ్వరి (ముమ్మిడివరం), కడలి విజయదుర్గ (రామచంద్రపురం); ప్రధాన కార్యదర్శులుగా చిట్టూరి రాధాబాయి (పి.గన్నవరం), పోతుల రత్నకుమారి (ముమ్మిడివరం), మట్ట కృష్ణకుమారి (రాజోలు), దిట్టకవి అమ్మాజీ (అమలాపురం), గుబ్బల రోజామణి (రాజోలు), భువనేశ్వరి (కొత్తపేట), అర్గాని శ్రీదేవి (మండపేట), పాలింగి ఉమాదేవి (కొత్తపేట); కార్యదర్శులుగా బడుగు దుర్గాదేవి (పి.గన్నవరం), జాలెం అనూష (పి.గన్నవరం), మోర్త రాణి మిరియం జ్యోతి (ముమ్మిడివరం), పేట్ల శాంతకుమారి (ముమ్మిడివరం), వాసంశెట్టి లావణ్య (రామచంద్రపురం), మల్లాడి శ్రీలక్ష్మి (రామచంద్రపురం), మొల్లేటి కనకదుర్గ (అమలాపురం), పొలమూరి దుర్గాదేవి (అమలాపురం), ఇంజేటి వసంత (రాజోలు), తోట సుజాత (రాజోలు), జె.సత్యవాణి (కొత్తపేట), చిన్నాను బేబీ (కొత్తపేట), ఇళ్ల వీరవాణి (మండపేట), సీహెచ్ అపర్ణాదేవి (మండపేట) నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా గోడి హేమలత (పి.గన్నవరం), దూనబోయిన వెంకట అనంతలక్ష్మి (పి.గన్నవరం), మందపాటి మహాలక్ష్మి (ముమ్మిడివరం), కాండ్రేగుల వెంకట సత్యవతి (ముమ్మిడివరం), కొత్తపల్లి అరుణ (రామచంద్రపురం), పిల్లి నాగ జ్యోతి (రామచంద్రపురం), పులసుగంటి శ్రీదేవి (అమలాపురం), కోరుకొండ మంగాయమ్మ (అమలాపురం), కొల్లాబత్తుల దీప్తి (రాజోలు), ముద్దాడ సీతా మహాలక్ష్మి (రాజోలు), పలవకట లక్ష్మి (కొత్తపేట), కె.జయలక్ష్మి (కొత్తపేట), బిక్కిన రాణి (మండపేట), ఎ.సాయిలక్ష్మి(మండపేట)లను నియమించారు.

సాంకేతికతపై అవగాహన కల్పించడమే లక్ష్యం

- డీఈఓ కమలకుమారి
- ఉత్సాహంగా జిల్లా స్థాయి కౌశల్ ప్రతిభా పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ కమలకుమారి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడమే కౌశల్ ప్రతిభా పోటీల ముఖ్య లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన జిల్లా స్థాయి కౌశల్ ప్రతిభా పోటీలు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ, విద్యార్థులకు పోస్టర్, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలోని 36 ప్రభుత్వ పాఠశాలల నుంచి 108 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. క్విజ్ పోటీల్లో యు.వెంకట సతీష్, కె.సిద్దు వెంకట సాయి, వి.రమ్యశ్రీ (కేశనకుర్రుపాలెం) రూ.7,500; నిఖిల్‌వర్మ, ఎస్.వినీత, ఎం.శ్రీగణేష్ (దంగేరు) రూ.6 వేలు; డీవీ సత్యనాగసాయి, డి.సూర్యప్రకాష్, టి.లోహిత (చెముడులంక) రూ.4,500 చొప్పున నగదు బహుమతులు గెలుపొందారని తెలిపారు. అలాగే, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అంశంపై వి.నమిత (తొండవరం – ప్రథమ) రూ.3 వేలు, ఎం.యశస్విని (గంగవరం – ద్వితీయ) రూ.2 వేలు, ఎస్.రషీదా బేగం (కొత్తపేట – తృతీయ) రూ.1,000 చొప్పున నగదు బహుమతులు గెలుచుకున్నారని వివరించారు. యల్లాప్రగడ సుబ్బారావు జీవిత చరిత్ర అంశంలో పి.సుశాంతరాజ్ (అమలాపురం – ప్రథమ) రూ.3 వేలు, ఎన్.ఆకాంక్ష (అంబాజీపేట – ద్వితీయ) రూ.2 వేలు, పీపీ క్రిష్ణ (వీరవల్లిపాలెం – తృతీయ) రూ.1,000 చొప్పున నగదు బహుమతులు సాధించారని డీఈఓ కమలకుమారి తెలిపారు. అంతకు ముందు రిటైర్డ్ సైంటిస్ట్ గారపాటి సూర్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. పరిశీలకులుగా పీవీఎల్ఎన్ శ్రీరామ్, జిల్లా సైన్స్ అధికారి జీవీ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షా సీఈఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా కౌశల్ కో ఆర్డినేటర్ బీఎస్ఎన్ మూర్తి, క్విజ్ మాస్టర్లు టీఎస్‌వీఎస్ఎస్ మూర్తి, సహాయ కో ఆర్డినేటర్ భాస్కరరావు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు సీఎం జగన్ బాసట

- జిల్లాలో ఏడుగురికి రూ.62.64 లక్షల ప్రభుత్వ సాయం
- వారి ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి



విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన పథకం చెక్కును అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం రూరల్: టాపర్లుగా నిలిచి, విదేశీ విశ్వవిద్యాలయాల్లో సీట్లు తెచ్చుకున్న పేద విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాసటగా నిలిచారు. జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం నిధులను ఆయన తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి, ఆయా విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిభావంతులైన పేద విద్యార్థులు సైతం ప్రపంచంలోని అగ్రశ్రేణి యూనివర్సిటీల్లో ఉన్నత విద్య చదువుకునేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలు చేస్తోందని చెప్పారు. ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ ప్రకారం అత్యున్నతంగా నిలిచిన ఏ విశ్వవిద్యాలయంలోనైనా పీజీ లేదా పీహెచ్‌డీకి ప్రవేశం పొందిన అల్పాదాయ వర్గాల్లో అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. అలాగే, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకం కింద సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. రాష్ట్రానికి చెందిన వారు ఎక్కువగా ఐఏఎస్, ఐపీఎస్ కొలువులు సాధించాలనే సమున్నత ఆశయంతో.. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పాసైన విద్యార్థులకు రూ.లక్ష చొప్పున, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే మరో రూ.50 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోందని వివరించారు. ఈ నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల అభ్యర్థులకు అవసరమైన శిక్షణ పొందేందుకు, సొంతంగా ప్రిపేర్ అయ్యేందుకు ఆర్థికంగా ఉపయోగపడతాయని చెప్పారు.

జగనన్న విదేశీ విద్యా దీవెన కింద జిల్లా వ్యాప్తంగా ఏడుగురు లబ్ధి పొందారని కలెక్టర్ తెలిపారు. తూరం ప్రశాంతి మౌనికకు (రాజోలు మండలం పొన్నమండ – కాపు) మొదటి విడతగా రూ.17,81,272, నిమ్మకాయల నాగసాయి వెంకట రంగ నిఖిల్‌కు (అమలాపురం – కాపు) మూడో విడతగా రూ.7,40,539, మట్టా సాయి ఫణి రవి రామానాయుడుకు (అమలాపురం – కాపు) మూడో విడతగా రూ.6,02,600, కరుటూరి తనూజ వెంకట సత్య శ్రీధర్‌కు (అంకంపాలెం – కమ్మ) మూడో విడతగా రూ.5,25,681, కోరిపల్లి అమృతకు (కుందూరు – కమ్మ) మూడో విడతగా రూ.13,34,619, బులుసు రామకృష్ణ ఆనంద శ్రీనివాస్‌కు (మండపేట – కమ్మ) రెండో విడతగా రూ.5,24,805, టేకుమూడి నిరోషాదేవికి (రామచంద్రపురం మండలం తాళ్లపాలెం – బీసీ) రూ.7,54,740 కలిపి మొత్తం రూ.62,64,256 మేర సీఎం జగన్ జమ చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జ్యోతిలక్ష్మీదేవి, బీసీ సంక్షేమ అధికారి వై.సాంబమూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



అమలాపురం రూరల్: ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకూ జరిగే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఈ పోటీల నిర్వహణపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, క్రీడా ప్రాధికార సంస్థ, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఐదు దశల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ ఖోఖో క్రీడాంశాల్లో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులను ఆదేశించారు. ఈ పోటీలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్రీడాకారుల రిజిస్ట్రేషన్, టీముల ఎంపిక, మ్యాచ్ ఇన్‌చార్జిల నియామకం వంటి ప్రక్రియలు పూర్తి చేసి, ఈ నెల 26 నాటికి క్రీడా ప్రాంగణాలను అన్నివిధాలా సిద్ధపరచాలని సూచించారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యంలో 90 శాతం వరకూ రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. క్రీడా పరికరాలు సచివాలయానికి చేరాయన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీలకు జిల్లావ్యాప్తంగా 189 క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశామని తెలిపారు. క్రికెట్‌కు 1,458 పురుష, 225 మహిళా జట్లు, బ్యాడ్మింటన్‌కు 1,702 పురుష, 1,590 మహిళా జట్లు, వాలీబాల్‌కు 853 పురుష, 211 మహిళా జట్లు, కబడ్డీకి 674 పురుష, 401 మహిళా జట్లు, ఖోఖోకు 83 పురుష, 792 మహిళా జట్లు ఏర్పాటయ్యాయని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు సురేష్ కుమార్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, సీపీఓ వెంకటేశ్వర్లు, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

- ఇష్టపడితే గణితం ఎంతో సులభం
- ఆసక్తి పెంచుకుంటే వందకు వంద మార్కులు
- అడుగడుగునా లెక్కలతోనే ముడిపడిన జీవితం
- రేపు జాతీయ గణిత దినోత్సవం

లెక్క చేయాల్సిందే..

రాయవరం: సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నట్లు.. సర్వశాస్త్రాణాం గణితం ప్రధానం అన్నది అక్షర సత్యం. మానవ మేధస్సును అత్యున్నత స్థాయికి చేర్చే శాస్త్రం గణితం. విద్యావంతుడైనా, నిరక్షరాస్యుడైనా గణితాన్ని ఉపయోగించకుండా జీవితంలో ఒక్క రోజైనా గడపలేడు. ఏ వృత్తిలోనైనా గణిత జ్ఞాన వినియోగం ఉంటుంది. అందుకనే గణిత శాస్త్రాన్ని ప్రతి ఒక్కరూ 'లెక్క' చేయాల్సిందే. గణితం ద్వారా తార్కిక ఆలోచన, స్వచ్ఛత, కచ్చితత్వం, వేగం, సృజనాత్మకత వంటి లక్షణాలను విద్యార్థులు అలవరచుకుంటారు. కానీ, గణితం అనగానే సాధారణంగా ఎక్కువ మంది విద్యార్థుల్లో ఆందోళన ఉంటుంది. అయితే, అటువంటి భయం అవసరం లేదని గణిత ఉపాధ్యాయులు అంటున్నారు. గణితంపై ప్రాథమిక స్థాయి నుంచీ ఆసక్తి పెంచుకుని, సాధన చేస్తే భయం తొలగించుకోవచ్చని, నూరు శాతం మార్కులు సాధించవచ్చని చెబుతున్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఏటా డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులకు గణితం పట్ల అవగాహన, ఆసక్తి పెంపొందించే కార్యక్రమాలను గణిత ఉపాధ్యాయులు చేపడుతున్నారు.

గణితానికి గుర్తింపు తెచ్చిన రామానుజన్

గణిత శాస్త్రానికి పుట్టిల్లుగా భారతదేశాన్ని పేర్కొంటారు. ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యుడు తదితర గణిత శాస్త్రవేత్తలు అనేక గణిత భావనలు ప్రవేశపెట్టారు. సున్నా, దశాంశమానం, రుణ సంఖ్యలు కనుగొన్నది సైతం భారతీయులే కావడం గమనార్హం. గణితాన్ని అందరికీ ఇష్టంగా మార్చిన ఘనత శ్రీనివాస రామానుజన్‌దే. తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో 1897 డిసెంబర్ 22న జన్మించిన ఆయన.. పిన్న వయస్సులోనే 1920 ఏప్రిల్ 26న మృతి చెందారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిన్న వయస్సులోనే గణితానికి సంబంధించి అనేక వ్యాసాలు రాశారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి గణిత శాస్త్రవేత్తల్లో ఒకరుగా నిలిచిన రామానుజన్ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు.


శ్రీనివాస రామానుజన్

కీలకంగా రామానుజన్ నంబర్ 1729

శ్రీనివాస రామానుజన్ కనుగొన్న సంఖ్య 1729 ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీని ఆధారంగానే క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన చికిత్స కూడా సాధ్యమైనదని గణిత మేధావులు అంటారు. కణాల పెరుగుదల ఎంత వేగంగా జరుగుతుంది, ఏం చేస్తే ఆ విలువను తగ్గించవచ్చో తెలుసుకోవడానికి 1729 ఆధారమైంది. ఇది క్యాన్సర్ చికిత్స కీమో థెరపీలోనూ కీలకంగా నిలిచింది. ఏటీఎంలో మనకు కావాల్సినంత సొమ్మును విడగొట్టే ప్రక్రియ రామానుజన్ గణిత సిద్ధాంతం ఆధారంగా రూపొందించారు. ఆ సిద్ధాంతాల ఆధారంగా రామానుజనిత గణితం అనే ప్రత్యేక విభాగాన్ని విదేశాల్లో సైతం ఏర్పాటు చేసి, విదేశీయులు ప్రత్యేక అధ్యయనాన్ని చేపట్టడం రామానుజన్ గొప్పతనాన్ని చెబుతోంది.

గణితాభివృద్ధికి ప్రభుత్వ కృషి

- విద్యార్థుల్లో గణిత కౌశలాలు పెంపొందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. జిల్లాలోని 31 పాఠశాలల్లో పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఆయా పాఠశాలల నుంచి ఇద్దరు గణిత ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. అక్కడితో వదిలేయకుండా పాల్ ల్యాబ్‌ల వినియోగంపై ప్రతి వారం రాష్ట్ర స్థాయిలో సమీక్షిస్తున్నారు.
- గణితాన్ని సులువుగా నేర్చుకునేందుకు మామిడికుదురు, దంగేరు (బాలికలు), రాజోలు జెడ్పీ హైస్కూళ్లలో స్టెమ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. కొత్తగా ద్రాక్షారామ, సత్యవాడ, మండపేట, కొమరగిరి, పల్లం, చెముడులంక, కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్టెమ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు.
- విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ విద్యను అందించడంలో భాగంగా గణితంలో డిజిటల్ విద్యకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా గణిత శాస్త్ర బోధనలో విద్యార్థులు ప్రత్యక్ష అనుభూతి పొందే అద్భుత అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.
- విద్యార్థులకు సులువుగా గణితాన్ని బోధించేందుకు వీలుగా జిల్లాలో ఎంపిక చేసిన 20 మంది గణిత ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించారు. వీరి ద్వారా మిగిలిన గణిత ఉపాధ్యాయులకు త్వరలో ఒక రోజు ఓరియంటేషన్ నిర్వహించనున్నారు.


ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు గణిత బోధన

- ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి (ఆప్కాస్ట్) ఆధ్వర్యాన ముమ్మిడివరం మండలం అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 27న జిల్లా స్థాయి గణిత దినోత్సవం నిర్వహించనున్నారు.

గణితంలోనూ అవధానం

సాధారణంగా అవధానం అనగానే తెలుగు భాష గుర్తుకు వస్తుంది. తెలుగు భాషలో అవధానులు ఈ ప్రక్రియ నిర్వహిస్తూ పృచ్ఛకులు వేసే ప్రశ్నలకు అనువుగా సమాధానాలు ఇస్తుంటారు. అయితే ఈ ప్రక్రియను గణితానికి అన్వయించి గణితావధాన ప్రక్రియను గణిత ప్రేమికులు రూపొందించారు. ఇందులోని ప్రక్రియలు గణితావధాని ధారణ, తార్కిక శక్తి, సమస్య సాధన వేగాన్ని పరీక్షిస్తాయి. ప్రేక్షకులకు విస్మయం కలిగించడంతో పాటు గణితంపై ఆసక్తి, అభిరుచిని కలిగిస్తాయి.

విద్యార్థులకూ నేర్పిస్తున్నా..



ఇప్పటి వరకూ 12 అవధానాలు చేశాను. దీంతో పాటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవధాన ప్రక్రియ నేర్పిస్తున్నాను. విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టి, ఆసక్తి కలిగించడమే దీని ముఖ్య ఉద్దేశం. ధారణా శక్తి, సమస్యను వేగంగా సాధించడం, ఒకే సమయంలో నాలుగైదు విషయాలపై ఆలోచన చేయడం దీనిలోని ముఖ్యాంశాలు.

– పతివాడ రవిశంకర్, గణితావధాని, జెడ్పీ హైస్కూల్, కొమరగిరి, యు.కొత్తపల్లి మండలం

రామానుజన్ స్ఫూర్తితో..



గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో అవధానాలు చేస్తున్నాను. ఇప్పటి వరకూ 200కు పైగా అవధానాలు చేయడమే కాకుండా టి.సూర్యతేజ, టి.సాయివంశీ, బిరుదా సందీప్ వంటి బాల గణితావధానులను తయారు చేశాను.

– తోటకూర సాయిరామకృష్ణ, గణితావధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సామర్లకోట

సాహిత్య అంశాలకు సమాంతరంగా..



సాహిత్య అవధాన అంశాలకు సమాంతరంగా గణితంలో కూడా సమస్యా పూరణం, వారగణనం, దత్తాంకం, నిషిద్ధాంకం, వ్యస్తాంకం, ఘనమూలం, ఆవృత దశాంశం, సరస ప్రసంగం వంటి 8 అంశాలుంటాయి. వీటితో ధార, ధారణలతో గణిత అష్టావధానం జరుగుతుంది.

– టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, గణితావధాని, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అమలాపురం

170 గణితావధానాలు చేశా..



ఇప్పటి వరకూ 170 గణితావధానాలు చేశాను. వింత చదరం (మ్యాజిక్ స్క్వేర్), వారగణన, 325తో భాగహారం, కారణాంకాలు కనుక్కోవడం తదితర అంశాల్లో ప్రావీణ్యం సాధించాను. ఇప్పటి వరకూ ఆరుగురు బాల గణితావధానులను తయారు చేశాను. ఇష్టం పెంచుకుంటే గణితం సులువుగా అనిపిస్తుంది.

– మానేపల్లి నాగార్జున, గణితావధాని, జెడ్పీ హైస్కూల్, రామవరం, తూర్పు గోదావరి జిల్లా

వాడపల్లి క్షేత్రంలో సిరుల వర్షం

- దండిగా హుండీల ఆదాయం
- వేంకటేశ్వరస్వామికి రూ.85.16 లక్షల రాబడి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రంలో సిరుల వాన కురిసింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం 29 రోజులకు రూ.85,16,279 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ.60,55,845, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.24,60,434 మేర ఆదాయం వచ్చిందన్నారు. అలాగే, విదేశీ కరెన్సీ, 10 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి కూడా లభించాయని తెలిపారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో కూడా హుండీల ద్వారా రూ.2,52,976 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ సత్యనారాయణరాజు ఆధ్వర్యాన జిల్లా దేవదాయ, ధర్మదాయ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానికీయమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ, వెల్ల గ్రూపు దేవాలయాల ఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది లెక్కించారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

రుడా చైర్మన్‌గా రౌతు సూర్యప్రకాశరావు


రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రౌతు

సాక్షి, రాజమహేంద్రవరం: నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రుడా చైర్‌పర్సన్‌గా ఉన్న మేడపాటి షర్మిలారెడ్డి పదవీ కాలం కొద్ది రోజుల కిందట ముగిసింది. ఆమె స్థానంలో నియమితులైన రౌతు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా ఆయన పదేళ్ల పాటు సేవలందించారు. రుడా కార్యాలయంలో చైర్మన్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సాత్విక్‌కు ఖేల్‌రత్నపై హర్షం

- గతంలో అర్జున్ అవార్డు
- ఈ ఏడాది ఏడు బంగారు, ఒక రజత పతకం
- సహచరునికీ ఇదే అవార్డు

సాక్షి, అమలాపురం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌కు దేశంలో క్రీడాకారులు ప్రతిష్టాత్మంగా భావించే 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డు వరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జాతీయ క్రీడా అవార్డులలో భాగంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం ఈ అవార్డు ప్రకటించింది. అమలాపురానికి చెందిన సాత్విక్ అంతర్జాతీయ వేదికలపై షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో పలు విజయాలు సాధిస్తూ దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది అంతర్జాతీయంగా జరిగిన ఐదు టోర్నీల్లో బంగారు, ఒక టోర్నీలో రజత పతకం సాధించారు. ఇటీవల కామన్‌వెల్త్, ఆసియా గేమ్స్‌లో అరుదైన విజయాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అతడిని ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేసింది. సాత్విక్‌తో పాటు అతడి డబుల్స్ సహచరుడు చిరాగ్ శెట్టి సైతం ఇదే అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ అవార్డును సాత్విక్ జనవరి 9న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులు మీదుగా రాష్ట్రపతి భవన్‌లో అందుకోనున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో గత మూడు, నాలుగేళ్లగా తిరుగులేని విజయాలు సొంతం చేసుకుంటున్న సాత్విక్ 2020లో ప్రతిష్టాత్మక అర్జున్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఆ సంవత్సరం కరోనా కారణంగా తొలుత వర్చువల్ విధానంలో అందుకున్న సాత్విక్ 2021లో న్యూఢిల్లీలో చేతుల మీదుగా అందుకున్నాడు. సాత్విక్‌కు అవార్డు రావడంపై ఆయన సొంత పట్టణం అమలాపురంలో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, రమామణి బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు.


అమలాపురంలో సంతోషాన్ని పంచుకుంటున్న సాత్విక్ తల్లిదండ్రులు కాశీ విశ్వనాథం దంపతులు


ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన సమయంలో ప్రధాన నరేంద్ర మోదీ నుంచి అభినందనలు అందుకుంటున్న సాత్విక్ (ఫైల్)

చాలా సంతోషం

సాత్విక్‌కు ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులుగా కన్నా సాత్విక్ ఆట నచ్చే అభిమానులుగానే ఎక్కువ ఆనందంగా ఉంది. సాత్విక్‌ను ప్రోత్సహిస్తున్న కోచ్‌లు, కోనసీమ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. – రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, అమలాపురం

నేడు నన్నయలో మెగా జాబ్ మేళా

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు బుధవారం ఈ విషయం తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన జరిగే ఈ మేళాలో 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 3 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని వివరించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకే వర్సిటీకి చేరుకోవాలన్నారు.

నిధుల కేటాయింపుపై ఎంపీ గీత కృతజ్ఞతలు


పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: అమృత భారత్ పథకం కింద జిల్లాలోని కాకినాడ, సామర్లకోట, తుని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ వంగా గీత కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని రైల్వే స్టేషన్లు, పిఠాపురం, గోర్స, మాధవపురం, తుని రైల్వే అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ) మంజూరు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు అనుమతులు ఇవ్వాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు. పిఠాపురంలో ఉప్పాడ గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) మంజూరు చేశారని తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పిఠాపురంలో లిఫ్ట్ నిర్మించాలని, నియోజకవర్గ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రజలకు సరైన టాయిలెట్లు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో చర్చించి, తగిన ఆదేశాలు జారీ చేస్తామన్నారని ఎంపీ గీత తెలిపారు.

అశుతోష్ శ్రీవాత్సవ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవాస్తవను కలెక్టర్ మాధవీలత అభినందించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్‌గా కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. జేసీ తేజ్‌భరత్ కూడా శ్రీవాత్సవకు అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కి చెందిన శ్రీవాత్సవ 2021 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. గ్వాలియర్‌లో బీఈ (ఎలక్ట్రానిక్స్) చదివి, 2021 సివిల్స్‌లో 223 ర్యాంక్ సాధించిన ఆయనను ఆంధ్రా కేడర్‌కు కేటాయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్‌గా బదిలీపై కొవ్వూరు వచ్చారు.


కలెక్టర్ మాధవీలతను కలిసిన కొవ్వూరు నూతన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా పద్మ


దూలం పద్మ

కపిలేశ్వరపురం (మండపేట): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన దూలం పద్మ నియామకాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తనకు ఉత్తర్వులందాయని పద్మ బుధవారం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా ఆమె 2021 సెప్టెంబర్‌లో నియమితులయ్యారు. పదవీ కాలం ఇటీవల పూర్తి కాగా, ఆ పదవిలో కొనసాగించాలంటూ సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పద్మ అన్నారు.

27న ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు


ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఏపీ ఐసెట్-2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కోరారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ 11, ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ 18, ఎంసీఏ 8 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఎంబీఏ 21, కాకినాడ క్యాంపస్‌లో ఎంబీఏ 24, ఎంసీఏలో 17 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని, అడ్మిషన్ నిర్ధారణ అయితే వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ఎన్నికల్లో శాంతిభద్రతలను పరిరక్షించాలి

కాకినాడ క్రైం: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీసు శాఖ పరిధిలో రెండు రోజుల పాటు ఆయన చేసిన తనఖీలు బుధవారం పూర్తయ్యాయి. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు బలగాలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో భద్రతే ప్రధానాంశంగా తగిన ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి తగిన సదుపాయాలు కల్పించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పరిపాలనాధికారికి సూచించారు. తొలి రోజు కార్యాలయ పరిపాలనా విభాగాల్లో తనిఖీలు చేశారు. వార్షిక ప్రగతి నివేదికలు పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూము నిర్వహణను డీఎస్పీ రామకోటేశ్వరరావు వివరించారు. వ్యాయామ శాలను పరిశీలించిన డీఐజీ నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. బుధవారం ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం నిర్వహించిన ప్రత్యేక పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించి, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయుధాగారం, పోలీసు జాగిలాలు, బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్‌లను డీఐజీ స్వయంగా పరిశీలించారు. డీఐజీ వెంట ఎస్పీలు సతీష్‌కుమార్, శ్రీనివాస్, అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఏఓ శివరామరాజు, డీఎస్పీలు వెంకట అప్పారావు, రామకోటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వరుడు, శ్రీనివాస్, శ్రీహరిరావు తదితరులు ఉన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్